



ఆయిదెకరాలు నిక్షేపం వంటి మామిడితోట ముప్ఫయి ఎకరాలకు పై చిలుకు సుక్షేత్రమైన మాగాణి, ఆంధ్రా బ్యాంకులోని అరంకెల డిపాజిట్టు, ఇంక ఆస్తిగల ఆసామి తనవాకిట్లోకి నడిచి వచ్చి నిరాడంబరంగా, 'మీ పిల్లవాణ్ణి ఇయ్యవయ్యా మేం పెంచుకుంటాం' అనినోరు తెరిచి అడిగితే మహామహా ఉన్నదని మిడిసి పాటు పడేవాళ్ళ కూడా కాదనలేనప్పుడు, ఇక ఎదుగూ బొదుగూ లేని ఒక ఆఫీసు గుమాస్తా వుద్యోగం అఘోరిస్తున్న మంగపతిరావుగారి మాట చెప్పవలసిన అవసరం ఏముంటుంది!

ఇద్దరు కొడుకులు, పుట్టి పురిటిలోనే పోయిన ఒక ఆడ పిల్ల, తనూ, భార్యతో కూడుకున్న ఆ 'పెద్ద' సంసారం ఈదడమంటే మంగపతిరావుగారికి ధృతరాష్ట్ర సంతానం పైన బడ్డ దాని కంటే భారంగా వుండిపోయింది. అలాంటి పరిస్థితుల్లో దీక్షితులుగారు తన యింటికి వచ్చారు. తొలి బిడ్డను తనకు వదిలేసి, మలి బిడ్డను దత్తు చేసుకుంటాననే మొక్కు చెవున బడెయ్యగానే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొని బయట పడేందుకు సాక్షాత్తు ఆ పరమేశ్వరుడు తన దీనాలాపన మన్నించి ప్రసాదించిన వరం అని భావించాడు. ఒక్క నిముషంలో లోపలకు పోయి భార్యతో ఒక చిన్న గుసగుస జరిపేసి సరే నన్నాడు

దత్త స్వీకారం జరిగే నాటికి బాలకృష్ణకు సరిగ్గా ఆయిదేళ్ళు నిండినవో లేదో, ఇంతే వయస్సు. పీటల మీద కూర్చుని తనచుట్టూవున్న వారంతా రంగు రంగుల పీతాంబరాలు కట్టుకోవడం చూచి పిల్లవాడు సంబర పడ్డమాట నిజమేగాని తను చిన్నప్పటి నుండి 'అమ్మ' 'అమ్మ' అని పిలుచుకుంటూ ఆడుకుంటూ వున్న కొయ్య బొమ్మ తనతోపాటు పట్టు గుడ్డలు ధరించి తన పక్కన లేక పోయినందుకు అమ్మ మీద నమిలిమింగేనంత కోపం వొచ్చేసి లేచి దూరంగా వెళ్ళి గోడ గిల్లుతూ నుంచున్నాడు. 'ఆ బొమ్మ లేనిదే నేను గుమ్మంలోకిరాను' అని అలకసాగించి. ఎట్లాగైతేనేం, మడిగట్టుకున్న వాళ్ళను మళ్ళీ మైల పడేయించి ఆ బొమ్మ తెప్పించుకోవడంలో కృతార్థుడై గర్వంతో కలాపం ముగించాడు బాలకృష్ణ.

'అక్కడకు పోయింతర్వాత కూడా ఇలాగే చీటికి మాటికి మూతిబిగించుతూ వుంటావుట్రా' క్రొత్త ఇంటికి కొడుకును సాగనంపుతున్న 'పాత' తల్లి ఎత్తుకుని ముద్దాడింది.

'అయ్యో! వాడు అలిగేదాకా మీ బావ గారు ఊరుకుంటారటమ్మా అసలు! కుర్రవాడి కాలికి మట్టి అయితేనే ధాం ధూంలు చేస్తారు' అంటూ 'కొత్త' తల్లి పెంపుడు కొడుకును చేతుల్లోకి తీసుకున్నది.

'అన్నాయి! అన్నాయి! మరే, ఊఁ నేను మా యింటికి పోతున్నారోయ్' అని అనుకోకుండా విభాగం చేసుకుని వెళ్ళిపోయినాడు బాలకృష్ణ.

పెంపుడు తల్లిదండ్రుల ఇంట్లో బాలకృష్ణకు లేని సౌకర్యం అంటూ వేలుబెట్టి చూపేందుకు

పోగుల కోటేశ్వరరావు

మచ్చు కొక్కటి కూడా కానరాదని అంగీకరించక తప్పదు. ఏమైనా సరే, కొత్తలో కొంత కాలంపాటు బెంగ పెట్టుకుంటాడనే ఉద్దేశంతో 'అసలు' అమ్మ అప్పుడప్పుడు వచ్చి పిల్లవాడిని చూసి వెళుతూండేది. రెండు గ్రామాల మధ్య పెద్దదూరం లేదుగనక అంత చేటు కష్ట మనిపించలేదు.

రోజులు గడుస్తున్నాయి. బాలకృష్ణ మధ్యాహ్నపు ఎండలో మట్టిబొమ్మలు చేసుకుంటూ ఆడుకోవాల్సిన వయస్సు మాత్రం ఇంకా దాటిపోలేదు. అయితే ఒక్కొక్కరోజు పైనబడుతున్నకొద్దీ బాలకృష్ణలో ఒక్కొక్క మార్పు చిత్రవిచిత్రాలుగా రూపొందుతూండటం దత్తు తండ్రి, తల్లి కాలయాపన లేకుండా గ్రహించగలిగారు.

కారణంలేకుండా ఏడవడం, చివరకు తనకు తానే సముదాయించుకుని ఊరుకోవడం ఈ జాబితాలో పేర్కొనదగిన మొట్టమొదటి విశేషం. పెళ్ళాం, పిల్లలు, పెద్దసంసారం మీద పడినవాడి మోస్తరుగా కొన్నికొన్ని వేళల్లో కన్నార్పకుండా చూస్తూ ఆలోచనలో నిమగ్నుడై యుండటం ఈ సందర్భంలో గుర్తించదగిన మరొకమార్పు. కలియబడి ఆటలో వస్తువును లాక్కుపోవాల్సిన కుర్రాడు సిగ్గుతో తల వొంచుకోవడం, అదేమంటే లేని నవ్వును తెచ్చి పెట్టుకోవడం,—ఇవన్నీ క్రమంగా చూస్తూవుంటే దీక్షితులుగారు బెజారెత్తిపోయారు. ప్రతిరోజూ భార్యాభర్తల ముచ్చట్లో ఇదే ప్రసక్తి సంభాషణాల భాగం ఆక్రమించుకునేది. ఎంతో హడావుడి పడి చర్చవిచర్చలు జరిపి చివరకు తేల్చిన సారాంశమేమిటంటే,—అబ్బాయిని వూరకనే కూర్చోబెట్టకుండా ఏదోరకంగా కాలక్షేపం చేయించడమే ఇందుకు సరైన మార్గము అని.

కనుక దీక్షితులుగారు ఒక క్రొత్త పథకం తయారుచేసి పెట్టారు. ఊళ్ళో జరిగే నానా జాతి ఉత్సవాలకూ అబ్బాయిని హాజరుపెట్టడం, గుళ్ళో పూజలు పురస్కారాలు సందడిగా వున్నప్పుడల్లా అక్కడకు తీసుకువెళ్ళడం. సంత జరుగుతూంటే రంకలరాట్నంతో సహా అన్నీ చూపించడం,- ఇవి ముఖ్యాంశాలుగా ఎన్నుకోవచ్చు. అంతేగాకుండా ప్రక్కనున్న బస్తీకి వెళ్ళి రకరకాల ఆటవస్తువులు కొనుక్కొచ్చి కొడుకు చేతికిచ్చాడు. స్టీమర్లు, విమానాలు, గ్లోబులు,- మార్కెట్లో దొరికిన 'మోడరన్' సరకులన్నీ ఒక్కొక్క నమూనా ఇంట్లోకి దిగుమతి చేయించారన్నమాట. సాయంకాలంపూట చల్లగాలికి షికారుగా పచారుచేసేందుకు ఒక తోపుడు మోటారుకారుతో సహా సమస్తం చేకూర్చబడినవి

అబ్బాయి బుద్ధి కుదిరి కూచున్న క్షణంలో రెండుముక్కలు వాగించేందుకు దీక్షితులుగారు ఒక ప్రయివేటు మాష్టరును ఏర్పాటు చేయించారు.

ప్రారంభదశలో దీక్షితులుగారి దృష్టికి అభినందించదగిన అభివృద్ధి కన్పించింది. అబ్బాయి 'క' కు దీర్ఘమిస్తే 'కా' అని వల్లెవేసే స్థాయిని దాటి 'కాకిపిల్ల కాకికి ముద్దు' అని మాటలు వాక్యాలు కలిపి చదివేంత పెద్దవాడయ్యాడు. 'ఏకోదర సోదరులు' 'దత్తపుత్రుడు' ఇంకా ఇలాంటి గొట్టుమాటలు అనేకం మాష్టరుగారు డిక్టేషను చెబుతూంటే తప్పులు లేకుండా వ్రాయగలుగుతున్నాడు.

అయితే ఇంట్లోకి వొచ్చిన తరువాత అమ్మ, నాన్నదగ్గర ప్రవర్తనలో వెనుకటి 'తప్పులు' ఇంతవరకూ కూడా సరిదిద్దుకో లేకపోయినాడు. అబ్బాయి ఈ క్రొత్త నివాసానికివచ్చి ఏడాదికి పైగా గడచిపోయినా ఇంకా క్రొత్తదనం సిగ్గు, బిడియం బాలకృష్ణను విడనాడటంలేదు. వీటన్నిటికీ తోడుగా విశేషించి తనకేదో తీరని లోపం జరిగినట్టు కొన్నికొన్ని సమయాల్లో ఏకాంతంగా కూర్చుని చింతాక్రాంత మనస్కుడై యుండటం దీక్షితులుగారికీ, ఆయన భార్యకు పెద్దకష్టంగా పరిణమించింది.

కాగా, అబ్బాయిని సరియైన దోవలోకి తీసుకొని వొచ్చేందుకు దీక్షితులుగారు మరికొన్ని క్రొత్త పోకడలు ఆచరణలో పెట్టారు.

సాయంకాలంవేళ తోపుడు కారులో అబ్బాయి విహారం వెళ్ళేందుకు ప్రత్యేకించి ఒక పనిమనిషి ఏర్పాటు చెయ్యబడ్డాడు. అబ్బాయి కారులో కూర్చుని, ఇళ్ళను వాకిళ్ళను, చెట్టు చేమలను వెనుకకు తరిమివేస్తూ వెళుతూంటే,

పనిమనిషి వెంటబడివచ్చి అబ్బాయికి ఎలాంటి ఆపదరాకుండా చూస్తూండేవాడు.

బాలకృష్ణ ప్రొద్దస్తమానమూ ఇంట్లో గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవడం తప్ప ఇరుగుపొరుగు పిల్లలను చేరదీసి ఆటలు, పాటలు, అల్లరి, ఇలాంటి వేమీ చెయ్యకపోయినందుకు ఇంట్లో తల్లిదండ్రులతో సహా బయట పెద్దమనుషులందరూ కలిసి ఆశ్చర్యపడ్డారు.

'అదేమిటండీ! ఈ యీడులో కేరింతలు కొట్టవలసినవాడు అట్లా దిగాలుపడి వుంటూ చేసేటి అబ్బాయి' అని దీక్షితులుగారి భార్య భర్తతో అనేకసార్లు చెప్పడం మొదలు పెట్టింది. దీక్షితులు ఇదొకరకం శారీరక అస్వస్థత అయి వుంటుందేమో అని అనుమానం కలిగినవాడై, వెంటనే పట్నంనుంచి ఫీజును లెక్క చెయ్యకుండా, ఒకానొక పెద్ద డాక్టరుగారిని పిలిపించి పరీక్ష చేయించాడు. డాక్టరుగారు దీర్ఘంగా ఆలోచించి తేల్చి చెప్పిన నిదానం ఏమిటయ్యా అంటే, ఏమీ లేదు. పసిగరుతో కలిసి కుర్రవాడు కులాసాగా తిరుగుతూంటే మందులూ మాకులు ఏమీ పనిలేదు అని.

బాలకృష్ణ దినదిన కార్యక్రమంలో మరొకటి గోచరమయింది. 'అసలు' పుట్టింటి దగ్గరనుండి ఈ నకలు తల్లిదండ్రుల ఇంటికి వచ్చినప్పుడు వెంట తెచ్చుకున్న కొయ్యబొమ్మను సదా దగ్గర వుంచుకుని బంగారు బొమ్మకంటె ఎక్కువగా. ఎదురుగా కన్పిస్తున్న పెంపుడు తల్లికంటె ఆ ప్యాయంగా పైనుంచి క్రిందకు నిమురుతూ, అదే పిచ్చిగా ఆనందం పొందుతూ వుండటంవల్ల దీక్షితులుగారు మళ్లీ దీర్ఘాలోచనలో పడవలసిన అవసరం కలిగింది. ఆయన భార్య అంతులేని విభ్రాంతికి గురి కాబడింది.

ఇరుగుపొరుగు పిల్లలకు దీక్షితులుగారు మిఠాయి పొట్లాలు కొనిపెట్టి వాళ్ళందరికీ తన ఇంట్లోకొచ్చి బాలకృష్ణతో కలిసి ఆడుకోమని నచ్చచెప్పాడు. ఆ రైళ్లూ, సైకిళ్ళు, గుర్రాలు గాడిదలు, వీటన్నింటినీ చూచి పిల్లలు గుమిగూడేవారు. ఇంట్లోమటుకు కావలసినంత అల్లరి ప్రారంభమై దీక్షితులుగారికి సంతానంలేని లోటు పూర్తిగా తొలగిపోయిందని చెప్పడానికి ఎట్టి సందేహమూ లేదు. అయితే బాలకృష్ణలో ఈ

షణ్మాత్రంగూడా పరిణామం కలగనందుకు ఆయన నిర్వీర్యమైపోయినాడు.

'మరికొన్నాళ్ళు గడిస్తే మన అబ్బాయి మనకు గాకుండా పోతాడేమో' అన్న భయం కూడా ఆదంపతులను ఆవహించిందనిచెప్పడంలో అతిశయోక్తి లేదు. వెంటనే మంగపతిరావు గారికి ఒక వుత్తరం వ్రాసి పడేశారు. ఒకసారి భార్యతోసహా వొచ్చి అబ్బాయిని చూచిపోవలసిందని, వాడి పరిస్థితి ఎంతమాత్రం ప్రోత్సాహకరంగా లేదని, ఈ సందర్భంలో ఆయన సలహా అవసరమని, ఇంకా ఏమేమో వ్రాశాడు.

విధి వైపరీత్యం గానివ్వండి, లేక మరేమైన అనుకోండి, మంగపతిరావుగారు వెంటనే రావడానికి సావకాశం చిక్కలేదు. భార్యా ఫ్రట్టింటిలో ఎదో అక్కరగావడంవల్ల అక్కడకు వెళ్ళిన మనిషి తిరిగి రావడంతో అలస్యమైపోయింది. ఇంతలో పెద్దబ్బాయి (వాడు ఒక్కడే అబ్బాయి అనాలేమో!) శరీరారోగ్యం గాడితప్పి నడవటం మూలంగా మరి కొన్నిరోజులు వాయిదా వెయ్యాల్సొచ్చింది. ఇక రేపోమాపో వొస్తున్నామని దీక్షితులుగారికి విపులంగా జవాబు వ్రాసి పంపారు.

బాలకృష్ణ పరిస్థితి నానాటికి తీసిపోతున్నందుకు దీక్షితులుగారికంటె ఎక్కువగా ఆయన భార్య భయాందోళనలు పొందినది. 'గొడ్డాలికి పిల్లలను పెంచడం ఏం చాతనవుతుంది!' అని అమ్మలక్కలు నలుగురూ ఆమెను దెప్పుతారు గదా అని దీక్షితులుగారి భార్య తీవ్రమైన సంతాపం అనుభవించింది.

ఏదో కాబట్టి సంతవరకూ తింటూ నే వున్నాడు. తిరుగుతూనే వున్నాడు బాలకృష్ణ. ఇది బయట ప్రపంచానికి కనుపించే స్వరూపం. ఏరకమైన రుగ్మతఏర్పడింది అనడానికి ఎక్కడా ఆస్కారం లేదు. అయితే వెనుకటినుంచీ వొస్తున్న వాడి విచిత్ర ప్రవర్తన ఇప్పుడు ఉధృతమైనందుకు ప్రత్యేకించి చెప్పుకోవాలి.

రాత్రిపూట నిద్రపోతూన్నప్పుడు మధ్య మధ్యలో 'అమ్మ' 'బొమ్మ' అని ఎక్కువగా కలవరించుతూండటం, ఇంట్లోను ఇంటి పక్క వాళ్ళకు తెలిసిన విషయమే. ఒక్కొక్కప్పుడు మంచంమీద లేచి కూర్చుని ప్రక్కలో పెట్టు

కుని పడుకున్న బొమ్మను చేతుల్లోకి తీసుకుని చూస్తూవుండేవాడు. దీక్షితులుగారి భార్యా మెలకువతో వుండి కుర్రవాణ్ణి బుజ్జగించి తిరిగి పడుకోబెడుతూవుండేది.

బాలకృష్ణ ఒకరోజు సాయంకాలం త్రొక్కుడు మోటారుకారులో షికారుకు బయల్దేరాడు. వెంటవెళ్ళిన పనిమనిషికి దీక్షితులు సాధారణంగా ఇవ్వవలసిన హెచ్చరికలన్నీ చేసి పంపాడు.

వూళ్లో సడీ సందడిని దాటి సంధ్యా సమయంలో వూరి వెలుపల ప్రశాంత వాతావరణంలోకి వొచ్చిపడ్డారు, కారులో బాలకృష్ణ, రెండు కాళ్ళమీద పనిమనిషి. చెట్టమీద పక్షులు ముక్కులతో పొడుచుకుంటూ 'కిచకిచ' శబ్దం చేస్తూవుంటే బాలకృష్ణ బిరబిరా సాగిపోతున్నాడు. రోడ్డుమీద తనకు ముందు మేకపిల్ల అరుచుకుంటూ పెద్ద మేకను కలుసుకునే ప్రయత్నంలో పరుగెత్తుతూన్నది. బాలకృష్ణ ద్విగుణీకృత ఉత్సాహంతో తొక్కుడుబండిని నడిపించాడు. పనిమనిషి వెనకనుంచి పరుగెత్తుకొస్తున్నాడు. బాలకృష్ణ పిక్కల్లోలేని శక్తిని కలుగజేసుకున్నాడు. క్రమంగా ఎర్రని సూర్యకాంతి అంతరించిపోయి చీకటి ముసుగు కప్పివేయబడినది. పనిమనిషికీ బాలకృష్ణకు మధ్య ఎంతదూరం ఏర్పడిందో ఇక తెలుసుకోవడం అసాధ్యం.

మరునాడు తెల్లవారు జామున యథాప్రకారం బజారువాకిట్లో పాచిపని చేసుకునేందుకు మంగపతిరావుగారి భార్య ఒక కిర్సనాయిల్ బుడ్డీ చేతపుచ్చుకుని తలుపు తీసింది. గడపదాటి అడుగు పెడుతూండగా ఆమె కాలికి ఏదో వొస్తువు గట్టిగా తగిలినంతనే ఆమె శరీరం పులకరించింది. ఆత్రుతతో నడుంవొంచి క్రింద వున్న వస్తువును వెనకి పట్టుకున్నది—తన రెండవ కొడుకు 'అమ్మ' అని పిలుచుకుంటూ మాటలు వొచ్చిన దగ్గరనుంచీ మొన్నటి వరకూ ఆడుకుంటూన్న కొయ్యబొమ్మ! వొణుకుతూన్న చేతులో నుండి దీపం జారి క్రిందపడి ఆరిపోయింది.

---

# బానిసలు చేసిన నేరం

(కథానిక)

బి. యస్. ఆర్. కృష్ణారావు

సుశీల ఏడుస్తున్నది. భారత నారీమణి అంతకన్న ఏంచేస్తుంది? గడుసుదయితే పీటలు, చెంబులు విసిరికొడుతుంది. నోరుగలదయితే తిడుతుంది. కోపమొచ్చేదయితే మూతి ముణగర దీసుకుని పడుకుంటుంది. వీరంతా భారత నారీమణులు. నవీన నారీమణి అయితే తలుపు తాళంవేసి సినిమాకు పోతుంది. కాని సుశీల ఈ రకంలో చేరదు. అచ్చగా పూర్వోత్రపు భారత నారీమణి. అంటే కడియాలు, గొళ్ళెపు గొలుసులు, చంపస్వరాలు, ముచ్చటముడి, మోచేతుల వరకు బిగువైన రవిక, కాశీపోసి బట్ట, ఇటువంటి పూర్వోత్రత కాదు కట్టుబొట్టు జుట్టులతో నవీన నారీమణి అయినా నోరు పూర్వోత్రపు నారీమణి కుండవలసిన నోరే. అంటే పూర్వోత్రపు భారత నారీమణుల్లోకూడా నోరుగలవాళ్ళున్నా సుశీల ఆ జాతిలోకూడా చేరదు. కాబట్టి సుశీలకు సుశీలయే సాటి. అంచేతనే ఏమీ చేయలేక ఏడుస్తున్నది వంటింటి పొగలో కూర్చుని. వంటింటి పొగ ఆమె ఏడుపుకు కారణభూతమయింది కాదు. రాజాధిరాజుల భార్యలైన రాణులమాదిరయితే వాళ్ళకు కోపమందిరాలూ తాపమందిరాలూ వుండేవి. ఏ కారణంచేతయినా కోపమొచ్చినప్పుడు వాళ్ళు ఆయామందిరాల్లో పడుకుని ఏడ్చేవాళ్ళు. అద్దె ఇల్లవటంచేత కోపమందిరాలు లేకపోగా పట్టుమని చిన్నగదియినా లేదు ఏడ్చేందుకు. అంచేత భారత నారీమణికి అనువైన ప్రదేశం వంటఇల్లే కాబట్టి అక్కడే కూర్చుని ఏడుస్తున్నది. అట్లా ఏడుస్తున్నదని వంటింట్లో చెయ్యవలసిన పని చెయ్యకుండా ఏడవటంలేదు. అట్లా చేస్తే గడుసరికింద వస్తుంది